క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ ఇంద్రనగర్‌కు చెందిన యాదవ సంఘం సభ్యులు సుమారు 60మంది ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమయ్యామని పేర్కొన్నారు. అందుకే బీఆర్‌ఎస్ పార్టీలో చేరామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త బీఆర్‌ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

సన్మానం



జోన్ సహాయ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న వెంకట్రావునగర్ ప్రతినిధులు

కూకట్‌పల్లి: వెంకట్రావునగర్ కాలనీసభ్యులు, జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ సహాయ కమిషనర్ కె. శ్రీకాంత్‌రెడ్డి ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వెంకట్రావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపతిరావు ఆదివారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దశరథరెడ్డి, అశోక్‌రెడ్డి, మధుకర్, ప్రసాద్, భాస్కర్‌రావు, కాలనీసభ్యులు, మహిళలు అధిక సంఖ్యల హాజరయ్యారు.

సాయిచంద్‌కు నివాళులు



సాయిచంద్ మృతికి నివాళులర్పించిన మాణిక్‌రెడ్డి

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాకింగ్ గ్రౌండ్‌లో ఆదివారం సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్‌ది ప్రత్యేక పాత్ర అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, రవీందర్, సాయిరెడ్డి, కర్క పెంటయ్య, కర్క రవీందర్, సోమయ్య, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గొట్టిముక్కల

కూకట్‌పల్లి: ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపేయాలనుకున్న ఓ విద్యార్థినికి కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు అండగా నిలిచారు. ఆదివారం హారికకు ఆర్థిక సాయం అందజేసి భవిష్యత్‌లో ఎలాంటి సహాయం కావాలన్నా తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఇంక్యుబేషన్ సెంటర్‌తో విద్యార్థులకు ప్రయోజనాలు



లాలాపేట: విద్యార్థుల మానసిక వికాసాన్ని ప్రతిబింబించడానికి ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ అన్నారు. ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ గ్రాండ్ ఫినాలేకు ఉస్మానియా యూనివర్సిటీ ఆతిథ్యం ఇచ్చింది. ఈ మేరకు ఓయూలోని సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ సెంటర్‌లో గతనెల జూన్ 10న నిర్వహించిన ఇండియాథాన్‌కు కొనసాగింపుగా ఫైనల్ ఈవెంట్ జరిగింది. దీని ద్వారా విద్యార్థి మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పర్చడం కోసం చాట్‌భాట్ కృషి ఇండియాథాన్ వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రొ.లక్ష్మీనారాయణ పాల్గొని ఐడియాథాన్ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్నల్ బీఎస్.రావు, డా. యుకే చౌదరీ, ప్రొ. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన హబ్.. ఇంకెన్నాళ్లు..!

నగర శివారుల్లో వరికి బదులు ఉద్యాన పంట సాగు పెంచాలని నిర్ణయం

- జిల్లా పర్యటనలో భాగంగా హబ్‌పై హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్
- సీఎంఓ ఆదేశాలతో రూ.250 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
- దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. విడుదల కాని నిధులు
- భర్తీ చేయని ఖాళీ పోస్టులు.. జాడలేని కొత్త పోస్టులు
- సాగుకు నోచుకోని 30 వేల ఎకరాల్లో అదనపు ఉద్యాన పంట
- నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కోరుతున్న రైతులు





సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారులో వ్యవసాయ పంట సాగును హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి నిధుల కొరత అడ్డంకిగా మారింది. ప్రతిఏటా 10 వేల ఎకరాల్లో హార్టికల్చర్ పంట సాగును పెంచడం ద్వారా మూడేళ్ల వ్యవధిలో ప్రస్తుతం సాగవుతున్న ఉద్యాన పంటతో పాటు అదనంగా 30 వేల ఎకరాలకు పెంచాలన్న జిల్లా ఉద్యానవన శాఖ లక్ష్యం నేరవేరడం లేదు. సీఎం హామీ ఇచ్చి దాదాపు మూడేళ్లు కావొస్తున్నా.. పట్టుమని 5 వేల ఎకరాల్లో కూడా అదనంగా ఉద్యాన పంట సాగు కాలేదు. సంబంధిత శాఖలో కూడా ప్రతిపాదిత అదనపు సిబ్బంది పోస్టులు మంజూరుకు నోచుకోలేదు. ఉద్యాన శాఖలో ఖాళీ ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు.

◆ సీఎం హామీ ఇచ్చి..

2020 అక్టోబర్ 29న నగర శివారు మూడుచింతలపల్లి మండల కేంద్రంలో ధరణి పోర్టల్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ శివారు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాను ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రతిపాదనలను కూడా ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2020 నవంబర్‌లో ఉద్యాన శాఖ జిల్లాను ఉద్యాన హబ్‌ను అభివృద్ధి చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది.

◆ ఉద్యాన హబ్‌పై ప్రతిపాదనలివే..

నగర శివారును ఉద్యాన హబ్‌గా అభివృద్ధి పరిచేందుకు ప్రాజెక్టు నిర్వహణ కింద మూడేళ్ల వ్యవధిలో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసింది. శివారుల్లోని 99 వేల ఎకరాల వ్యవసాయ(పంట సాగు) భూమి ఉండగా, ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యానవన పంట సాగు చేస్తున్నారని, మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నట్లు ప్రతిపాదనల్లో వివరించిన యంత్రాంగం 2024 సంవత్సరం వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అదనంగా 30 వేల ఎకరాల్లో ఉద్యాన(హార్టికల్చర్) పంట సాగు చేయవచ్చునని పేర్కొంది. ప్రతిఏటా 10 వేల ఎకరాల చొప్పున దశలవారీగా మూడేళ్లలో 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంట సాగు పెంచేందుకు అవకాశముందని, ఇందు కోసం హార్టికల్చర్ శాఖలో ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బంది సంఖ్యకు అదనంగా ఏడుగురు హార్టికల్చర్ అధికారులు, 10 మంది హెచ్ఈఓ పోస్టులు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో యంత్రాంగం పేర్కొంది.

◆ దాదాపు మూడేళ్లు కావొస్తున్నా..

నగర శివారు ఉద్యాన హబ్ అభివృద్ధిపై ప్రభుత్వానికి జిల్లా ఉద్యాన శాఖ నివేదిక సమర్పించి దాదాపు మూడేళ్లు కావొస్తున్నా.. మోక్షం లభించకపోవడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు అలుముకున్నాయి. దీంతో గడిచిన రెండేళ్లలో కూడా అదనంగా 5 వేల ఎకరాల్లో కూడా ఉద్యాన పంట సాగు పెంచలేదు. జిల్లా హార్టికల్చర్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు. అదనపు పోస్టుల మంజూరీ ఊసే లేదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలోనైనా ప్రభుత్వం నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేసేందుకు తక్షణమే నిధుల విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



కూకట్‌పల్లి ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోదీ సుపరిపాలన సాధించిన విజయాలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా మహా జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో పేరుతో ఇంటింటికీ బీజేపీ భరోసా కార్యక్రమానికి తెలంగాణ బీజేపీ నేతలు శ్రీకారం చుట్టారు. - అందులో భాగంగా ఈనెల 5న కూకట్‌పల్లి ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే బీజేపీ భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పరిశీలించారు. సుమారు 5వేల మందికి పైగా రానున్న ఈ సభకు వేదిక నిర్మాణం, ప్రజలు కూర్చునే స్థలాల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై నాయకులతో చర్చించి పలు సూచనలు చేశారు.

◆ ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. అవినీతి కుటుంబ పాలనను అంతమొందించే దిశగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. ఆ మార్పు బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ప్రతి ఒక్కరూ తరలి రావాలన్నారు. కార్యక్రమంలో సూర్యారావు, శ్రీకర్‌రావు, హరిబాబు, వినోద్, బాలనారాయణ, సింధు, లహరి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సునీత (ఫైల్)

జగద్గిరిగుట్ట: భర్తతో గొడవ పడిన ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన భద్రచలం, నీరజ (25)లు భార్యాభర్తలు. ఈనెల 1వ తేదీ ఉదయం 11గంటలకు భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆమె రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం భద్రాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15లక్షలు విలువ చేసే బంగారం రికవరీ

నిజాంపేట్: పని చేస్తున్న ఇంట్లోనే సొత్తు కాజేసిన మహిళ నుంచి బాచుపల్లి పోలీసులు రూ.15లక్షలు విలువ చేసే బంగారు, డైమండ్ ఆభరణాలను రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి గ్రీన్ ఎవెన్యూ విల్లాస్‌లోని విల్లా నం.114లో బీవీవీ సత్యనారాయణ కుటుంబం నివాసముంటోంది. సదరు విల్లాలో కేపీహెచ్‌బీ కాలనీ గోపాల్‌నగర్‌లోని గుడిసెల్లో నివాసముండే వెంకటలక్ష్మి (38) పని చేస్తోంది. కాగా అనారోగ్యం కారణంగా సత్యనారాయణ కుటుంబం గతనెల 24వ తేదీన తూర్పు గోదావరి జిల్లాలోని తమ సొంత ఊరుకు వెళ్లారు.

◆ ఈ నేపథ్యంలో విల్లా తాళం చెవిని వెంకటలక్ష్మికి ఇచ్చి ప్రతిరోజు విల్లాను ఊడ్చడంతో పాటు మొక్కలను నీళ్లు పోయాల్సింది చెప్పారు. అయితే అప్పులతో సతమతమవుతున్న వెంకటలక్ష్మి విల్లాలోని డ్రాలో ఉంచిన రూ.15 లక్షలు విలువ చేసే రెండు బంగారు డైమండ్ గాజులు (39 గ్రా), రామ్ పరివార్ నెక్లెస్, చెవికమ్మలు (27గ్రా), రోజ్‌గోల్డ్ నెక్లెస్, చెవికమ్మలు (27 గ్రా) దొంగిలించింది. ఇటీవల స్వగ్రామం నుంచి బాచుపల్లికి వచ్చిన సత్యనారాయణ కుటుంబం డ్రాలో ఉంచిన బంగారు ఆభరణాలు మాయం కావడంతో వెంకటలక్ష్మిపై అనుమానంతో బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను తమదైన శైలిలో విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించింది. ఆదివారం సదరు సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితురాలు వెంకటలక్ష్మిని రిమాండ్‌కు తరలించారు.

ఉద్యమ నేత డా. జేబీ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు



ఉద్యమ నేత జేబీ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మోతీనగర్: ప్రముఖ సామాజిక ఉద్యమ నేత డాక్టర్ జేబీ రాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనతో కేక్ కట్‌చేసి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంటా మల్లేష్, రెడ్డిమల్ల పార్వతి, బి. చంద్రశేఖర్, గంట శ్రీనివాస్, కె. ఆనంద్‌కుమార్, లక్ష్మీనారాయణ, శ్రీశైలం, గంట దయానంద్, ఎం. శ్యామ్, గణేష్, బి.దేవదాస్, సందీప్‌కుమార్, శంకర్, దయానంద్, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యులు సమాజ రక్షకులు



హైదరాబాద్ నాలెడ్జి సిటీలో డాక్టర్లను సత్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గం: వైద్యులకు సమాజ రక్షకులుగా అనాదిగా గుర్తింపు ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని హార్డ్ రాక్ కేఫ్‌లో 'ది సేవియర్స్ ఆఫ్ సొసైటీ' పేరిట ట్రైలైట్ లగ్జరీ రెసిడెన్సీస్, ది లగ్జరస్ హై రైస్ టవర్స్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా శనివారం రాత్రి పలువురు డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో కష్టపడి పనిచేసే వైద్యులను అందరూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా డాక్టర్ల దినోత్సవం నిర్వహించడం, వారిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ అంజలీ గుల్షన్, విక్రమ్ పూసర్ల, రాజాహెగెల్‌తోపాటు పలువురిని ట్రైలైట్ లగ్జరీ రెసిడెన్సీస్, ది లగ్జరస్ హై రైస్ టవర్స్ ప్రాజెక్టు డైరెక్టర్లు జక్కిరెడ్డి సంజీవరెడ్డి, సంజయ్‌గులబాని ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, ఫన్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పలువురు డాక్టర్లు,ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

గచ్చిబౌలి-గండి మైసమ్మ బస్సు సర్వీసు ప్రారంభం

రూట్ నెంబర్ 221జీతో నేటి నుంచి రాకపోకలు



రాయదుర్గం: ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను నడిపేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గచ్చిబౌలి నుంచి గండిమైసమ్మ ఆలయం వరకు కొత్తగా బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు నిర్ణయించారు. డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిపో అధికారులు ఇందుకోసం సోమవారం నుంచి బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. 221జీ నెంబర్‌తో గచ్చిబౌలి నుంచి గండిమైసమ్మ ఆలయం వరకు బస్సు నడుపుతారు. గచ్చిబౌలి నుంచి ప్రారంభమయ్యే బస్సు అంజయ్యనగర్, కొండా పూర్, హఫీజ్‌పేట్, ఆల్విన్‌కాలనీ ఎక్స్‌రోడ్, మియాపూర్, మియాపూర్ ఎక్స్‌రోడ్, జేపీనగర్, మైత్రినగర్ ఎక్స్‌రోడ్, బీబీడబ్ల్యూ, మియాపూర్ డిపో, మక్తా, బొల్లారం ఐడీఏ ఎక్స్‌రోడ్, బాచుపల్లి, ఎంఎన్‌ఆర్ కాలేజ్, దర్గా, శ్రీచైతన్యకాలేజ్, వీఎన్‌ఆర్ కాలేజ్, ప్రగతినగర్ ఎక్స్‌రోడ్, కై సర్‌నగర్/డీఆర్‌కే కాలేజ్, సూరారం విలేజ్ ఎక్స్‌రోడ్, బౌరంపేట్ ఎక్స్‌రోడ్, మైల్ స్టోన్, మీదుగా గండి మైసమ్మ ఆలయం చేరుకుంటుందని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అదే రూట్లో తిరిగి ఈ బస్సు గచ్చిబౌలి వరకు రాకపోకలు సాగిస్తుందన్నారు. గచ్చిబౌలిలో ఈ బస్సు ఉదయం 5.30 గంటల కు ప్రారంభమవుతుండగా చివరి బస్సు రాత్రి 8.25 గంటలకు బయలు దేరుతుంది. గండిమైసమ్మ ఆలయం వద్ద ఉదయం 6.40 గంటలకు ప్రారంభమై చివరి బస్సు 9.40 గంటల కు బయలుదేరుతుంది. ఈ రూట్లోని ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

వైఎస్‌ఆర్ జయంతి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



కూకట్‌పల్లి: దివంగత నేత, సంక్షేమ సారథి, బడుగు, బలహీనవర్గాల ఆరాధ్య దైవం వైఎస్. రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకొని ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు 3వ ఫేజులోని రమ్యాగ్రౌండ్‌లో ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్‌ఆర్‌సీపీ ఐటీ వింగ్ విభాగ అధ్యక్షుడు సునీల్ పోసింరెడ్డి, హైదరాబాద్ ఐటీవింగ్ సభ్యులు, రాజశేఖర్‌రెడ్డి అభిమానులు అశేష సంఖ్యలో హాజరయ్యారు.

అంబేడ్కర్ బాటలో యువత నడవాలి



గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధుల సమావేశంలో నాయకులు

మూసాపేట: గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధుల సమావేశం గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో మూసాపేటలోని హోటల్ దేవిగ్రాండ్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అంబేడ్కర్ సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ యస్. వరుణ్‌కుమార్, హైకోర్టు సీనియర్ న్యాయవాది బాలత్రిపుర సుందరి, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం ప్రభాకర్, ప్రముఖ అంబేడ్కర్‌వాది బీఎస్ రత్న విచ్చేసి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. గురు పూర్ణిమ ధమ్మచక్ర ప్రవర్తన దినోత్సవం సందర్భంగా గౌతమ బుద్ధునికి, అంబేడ్కర్, జ్యోతిరావు పూలేకి, సావిత్రిబాయ్ పూలే, రమాభాయ్ అంబేద్కర్, సాహు మహారాజ్‌లకు పూలతో నివాళులర్పించారు. అంబేడ్కర్ చూపిన బాటలో యువత నడవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన దళిత నాయకులు కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న, గిడ్డంగుల శాఖ చైర్మన్‌సాయిచంద్, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే. విద్యాసాగర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం





ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని శ్రీషిరిడీ సాయి దేవాలయం 26వ వార్షికోత్సవం, గురు పౌర్ణమి మహోత్సవ వేడుకలు ఆదివారం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మహా సుదర్శన హోమం, సహస్ర కళశాభిషేకం,మహా చండీ హోమం, అన్నదాన కార్యక్రమం, కాగడ హారతి, పల్లకి సేవ కన్నుల పండుగ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి భజనలు, సంకీర్తనలు కోలాటాలతో ఆనందోత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం దత్త సాయి హోమం, మూలమంత్ర హోమం, సర్వదేవత గాయత్రి హోమం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గుర్రం బగ్గీపై సాయిబాబా గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బాబా కృపకు పాత్రులు కావాలని కోరారు.

బీసీ జనగణన వెంటనే పూర్తి చేయాలి

లిబర్టీ: పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యే లోపే కేంద్ర ప్రభుత్వం జనగణనకు శ్రీకారం చుట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్రు కుమారస్వామి డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ జనగణన చేస్తారా లేదా అన్న అంశంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలన్నారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జనగణన దేశవ్యాప్తంగా చేసేలా ప్రధాన మంత్రి ప్రకటన చేయాలని లేనిపక్షంలో పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెస్తామని వెల్లడించారు.

అర్హులందరికీ దళితబంధు అందించాలి

లిబర్టీ: దళిత బంధు పథకం అమలులో తీవ్ర వివక్ష జరుగుతుందని అర్హులైన వారందరికి వర్తింపజేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ విజ్ఞప్తి చేశారు. దళితుల ఆర్థిక ప్రగతి కోసం సంక్షేమం కోసం ప్రభుత్వం దళితబంధును ప్రవేశపెట్టిందన్నారు. కాని కేవలం మాదిగ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తున్నారని ఎస్సీ జాబితాలోని మాలలను ఇతర ఉపకులాలను విస్మరిస్తున్నారన్నారు. ప్రభుత్వం దళితబంధును కేవలం మాదిగల కోసమే ప్రవేశపెట్టలేదని ఎస్సీలందరి కోసం ప్రవేశపెట్టిందని ఆదివారం జరిగిన మాల మహానాడు సమావేశంలో అన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KUKATPALLY COURT, AT KUKATPALLY
S.O.P. No. 03 of 2023

Between:

1. **Dr.Malarkodi Gunabushanam,** W/o. Late Gunabhushanam Nasi, Aged about 72 years, Occ: Retired Employee, Presently residing at 14 Beachside Common, Westport, CT 06880, USA.
2. **Dr.Vikraman Gunabushanam,** S/o. Late Gunabhushanam Nasi, Aged about 47 years, Occ: Doctor, Presently residing at 7067 Bennington Woods Drive, Pittsburgh, PA 15237, USA.
3. **Dr.Gowthaman Gunabushanam,** S/o. Late Gunabhushanam Nasi, Aged about 43 years, Occ: Doctor, Presently residing at 14 Beachside Common, Westport, CT 06880, USA. All the above petitioners are local residents of H.No.4-189, Ferozguda, Bowenpally Post, Hyderabad.

...Petitioners

AND

1. The Manager, Axis Bank, Balanagar, Hyd
2. All Concerned ...Respondents

NOTICE

The above named petitioners herein have filed the above S.O.P. No.3 of 2023 for grant of Succession Certificate under section 372 of Indian Succession Act for an amount of Rs. 1,24,141,70.24 Paisa transfer standing in the name of the deceased Late N.Gunabushanam to be effected by the 1 to 3 petitioners, 1st respondent. The said S.O.P. No.3 of 2023 stands posted on **18-07-2023** at 10:30 AM. If anybody has got objection for grant of the above relief in favour of the above said petitioners, they may file their objections before the undersigned on the said date. Otherwise the matter will be heard and decided as per the rules.

By direction of the Hon'ble Principal Senior Civil Judge, Kukatpally Court, At Kukatpally.

Sd/- Smt. NASEEM ARA,
Advocate for Petitioners
Office at: Flat No.504, 5th Floor, Modern Residency Apartments, Besides Muslim Maternity Hospital, Hyd.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కొత్తూరు సీతయ్యనగర్‌లో లీఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ కొత్తూరు సీతయ్యనగర్‌లో లీఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ జన్మదినం సందర్భంగా శ్రీవివేకానందనగర్ నాయకులు ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, బొంతు హరికృష్ణ, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అవంతినగర్‌లో...

మూసాపేట డివిజన్‌లోని కమిటీహాల్‌లో యశోద ఆస్పత్రి సోమాజిగూడ బ్రాంచ్, అవంతినగర్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, ఈసీజీతో పాటు సాధారణ వైద్య పరీక్షలు అందించారు. అవంతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అందించటం గొప్ప విషయం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీహాల్‌లో ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ శిబిరంలో 18 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నర్సింహారెడ్డి, వికాష్ శుక్ల, సబీద, ఆర్గనైజర్ శివ, కాలనీవాసులు గాంధీరావు, గోపిచంద్, జయప్రసాద్, రామచంద్రరెడ్డి, మల్లేశ్వరాచారి, శివ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట వార్డు కార్యాలయంలో..

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కుండా దేవయ్య పటేల్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు మందులను ఉచితంగా అందచేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 300 మందికి పైగా ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో తమతో పాటు ముందుండి నడుస్తున్న వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్, నాయకులు తెల్ల హరికృష్ణ పటేల్, బాశెట్టి నర్సింగరావు, సప్పిడి వెంకటేష్, తూము శైలేష్ కుమార్, గున్నాల వినోద్‌కుమార్, జిల్లా మనోజ్, శ్రీకరరావు తదితరులు పాల్గొన్నారు.